

పుస్తకాలతో కుస్తీ వద్దు..
దోస్తీ చేద్దాం
పరీక్షల కాలం.. ప్రణాళికతో
చదువాలంటున్న నిపుణులు
ఆట, పాటలకు జోలికి వెళ్లొద్దు
మానసిక ఒత్తిడిని అధిగమించాలి
ఆహారపు నియమాలు తప్పనిసరి
7



రబ్బర్ బియ్యం కాదు..
ఫోర్టిఫైడ్ రైస్
పోషకాల మిళితం.. ఆరోగ్యదాయకం
తెలియక వేరు చేసి తింటున్న ప్రజలు
అవగాహన కల్పించని అధికారులు
7

ప్రమాదం పొంచిఉన్నా..
పట్టించుకోరా?
ప్రధాన రోడ్ల పక్కనే వ్యవసాయ బావులు
కనిపించని రక్షణ గోడలు,
సూచిక బోర్డులు
8
గతంలో ట్రాక్టర్ దూసుకెళ్లి ఓ రైతు మృతి

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోరు రసవత్తరంగా మారుతున్నది. రెండు స్థానాలకు భారీగా పోటీ నెలకొన్నది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ రేసులో 56 మంది, టీచర్ల పోరులో 15 మంది నిలిచారు. పోలింగ్ తేదీ (ఈ నెల 27) సమీపిస్తుండడంతో ప్రచార హడావుడి ప్రారంభమైంది. విద్యాధికులే ఓటర్లైన పోరు రాజకీయ రంగు పులుముకోవడంతో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలను తలపిస్తున్నాయి.



ఎమ్మెల్సీ దంగల్

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు

ఉట్కూరి నరేందర్‌రెడ్డి, చిన్నమైల్ అంజిరెడ్డి, యాదగిరి శేఖర్‌రావు, ప్రసన్న హరికృష్ణ, సర్దార్ రవీందర్‌సింగ్, బక్క జడ్సన్, దొడ్ల వెంకటేశం, మంద జ్యోతి, లంటు చంద్రశేఖర్, సిలివేరి ఇంద్రాగౌడ్, బి.సుభాష్, అక్కెనపల్లి కరుణాకర్, అవినాశ్ జాదవ్, అబ్బగోని అశోక్‌గౌడ్, మేకల అక్షయ్‌కుమార్, అంగ సంపత్‌యాదవ్, కర్ర జగన్నాథ్, కస్ప శంకర్‌రావు, కంటె సాయన్న, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గవ్వల శ్రీకాంత్, గుమ్మడి శ్రీశైలం, చంద సాయికుమార్, చిట్కుల నరేందర్‌రెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, చలిక చంద్రశేఖర్, జావెద్ అహ్మద్, దయ్యాల ఓంప్రకాశ్, దూడ మహిపాల్, దేవతి శ్రీనివాస్, దేవునూరి రవీందర్, నగేశ్ కొమ్ముల, నిమ్మతోట వెంకటేశ్వర్లు, పిడిశెట్టి రాజు, పులగం దేవదాసు, బాలాజీ భక్వాడ్, బండారి రాజ్‌కుమార్, బండి శ్రీనివాస్, మచ్చ శ్రీనివాస్, మల్లేశ్ యాసర్ల, మహ్మద్ ముస్తాక్ అలీ, మహేశ్ కొమ్మిరెడ్డి, మెతుకు హేమలత, మంచికట్ల ఆశమ్మ, రమేశ్‌బాబు శనిగరం, రాజసుమన్ రావు, రాపాల రాజు, లైశెట్టి హరికృష్ణ, రాథోడ్ రవీందర్ నాయక్, వేముల కరుణాకర్‌రెడ్డి, వేముల విక్రంరెడ్డి, శ్రీకాంత్ సిలివేరు, ఎన్.శ్రీనివాస్, సాయికృష్ణమూర్తి, టి.సుధాకర్‌రావు, సంకినేని మధుసూదన్‌రావు.

మెదక్-కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో పట్టభద్రుల ఓట్లు

మొత్తం	3,41,313
పురుషులు	2,18,060
మహిళలు	1,23,250

గ్రాడ్యుయేట్ ఓట్ల వివరాలు

జిల్లా	కేంద్రాలు	మహిళలు	పురుషులు	మొత్తం
సంగారెడ్డి	40	6766	14437	21203
మెదక్	22	3420	8533	11953
సిద్దిపేట	40	10624	20922	31546
మొత్తం	102	20,810	43,892	64,702

నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ఉపాధ్యాయ ఓట్లు

మొత్తం	25,921
పురుషులు	16,364
మహిళలు	9,557

టీచర్స్ ఓట్ల వివరాలు

జిల్లా	కేంద్రాలు	మహిళలు	పురుషులు	మొత్తం
సంగారెడ్డి	28	1103	1485	2588
మెదక్	21	515	766	1281
సిద్దిపేట	23	1104	1948	3052
మొత్తం	72	2,722	4,199	6921

రెండు స్థానాలకు 71 మంది పోటీ
గ్రాడ్యుయేట్స్, టీచర్స్ అభ్యర్థుల హోరాహోరీ ప్రచారం

సోషల్ మీడియా, ఫోన్‌కాల్స్‌తో పలకరింపు
ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్, బీజేపీ
దూసుకెళ్తున్న పట్టభద్రుల స్వతంత్ర అభ్యర్థులు
ఉపాధ్యాయ అభ్యర్థుల పరస్పర ఆరోపణలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 14 : మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో ఎక్కడ చూసిన ఎమ్మెల్సీ ఎన్నికల చర్చ నడుస్తున్నది. కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. బలమైన అభ్యర్థులను బరిలోకి దింపడంతో పాటు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో మంత్రులు పాల్గొనగా, సంగారెడ్డిలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి మద్దతుగా

మిగతా 7వ పేజీలో

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు వీరే..

వంగ మహేందర్‌రెడ్డి, మల్క కొమురయ్య, జగ్గు మల్లారెడ్డి, కూర రఘోత్తమరెడ్డి, వై.అశోక్‌కుమార్, యాటకారి సాయన్న, గవ్వల లక్ష్మి, కంటె సాయన్న, చలిక చంద్రశేఖర్, ఇన్నారెడ్డి తిరుమల రెడ్డి, మామిడి సుధాకర్ రెడ్డి, ముత్తారం నర్సింహ స్వామి, వేముల విక్రమ్ రెడ్డి, సిలివేరు శ్రీకాంత్, ఎల్.సుహాసిని.

వృత్తి నైపుణ్య మెరుగుకు
శిక్షణలు దోహదం
● సిద్దిపేట సీపీ డాక్టర్ అనురాధ



నంగునూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు శిక్షణలు ఎంతో దోహదపడతాయని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ అన్నారు. నంగునూరు మండలం రాజగోపాలపేటలో శుక్రవారం పోలీస్ అధికారులకు, సిబ్బందికి వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ శిక్షణలో నేర్చించిన మెలకువలను శ్రద్ధతో అభ్యసించి సమయానుకూలంగా శాంతి భద్రతలు పరిరక్షణకు ఉపయోగించాలన్నారు. పోలీసు విధి నిర్వహణలో, శాంతిభద్రతల రక్షణలో సాంకేతికతతోపాటు ఆయుధ పరిజ్ఞానం ఎంతో అవసరం ఉంటుందని తెలిపారు. సిబ్బందికి అన్ని రకాల ఆయుధ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఫైరింగ్‌లో ఉత్తమ ప్రతిభకనబర్చిన అధికారులను, సిబ్బందిని కమిషనర్ అభినందించారు. శిక్షణలో భాగంగా పోలీసు కమిషనర్ డాక్టర్ అనురాధ యంపీ 5 రైఫిల్, గ్లాక్ పిస్టల్‌తో ఫైర్ చేయగా, పోలీస్ అధికారులకు 9ఎంఎం పిస్టల్, ఇతర వెపన్స్‌తో ఫైరింగ్ చేశారు. ఈ ఫైరింగ్ ప్రాక్టీస్‌లో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు మధు, సతీష్, పురుషోత్తంరెడ్డి, సుమన్‌కుమార్, రవీందర్, వివిధ శాఖల పోలీస్ అధికారులు కిరణ్, శ్రీధర్, శ్రీధర్‌గౌడ్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల
నిర్మాణాలు ప్రారంభం
● హౌజింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.దామోదర్‌రావు



మాట్లాడుతున్న హౌజింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ దామోదర్‌రావు

మద్దూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 26 మండలాల్లో ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు హౌజింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.దామోదర్‌రావు స్పష్టం చేశారు. శుక్రవారం మద్దూరులో నిర్మిస్తున్న ఇందిరమ్మ నమూనా ఇల్లు పనులను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నెల రోజుల్లో నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు నమూనా చూపించాలన్నారు. లబ్ధిదారుల పరిస్థితి మెరుగ్గగా ఉంటే అదనంగా 50 నుంచి 100 స్క్వేయర్ ఫీట్స్ మేర నిర్మాణాన్ని పెంచుకోవచ్చన్నారు. పైలట్ గ్రామాలుగా ఎంపికైన కూటిగల్, ధర్మారంలో స్థానిక మేస్త్రీలకు అవగాహన కల్పించి ముగ్గు పోసుకునేలా సెక్రెటరీలు సూచించాలన్నారు. ఇంటి నిర్మాణాల్లో నాలుగు విడుతలుగా బిల్లుల చెల్లింపులుంటాయని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో రాంమోహన్, సెక్రటరీలు అశోక్, అనిత ఉన్నారు.





అమర జవాన్లకు వందనం

పుల్వామా దాడిలో వీర మరణం పొందిన వీరజవాన్లను స్మరిస్తూ సిద్దిపేట పట్టణంలో శుక్రవారం ట్రస్మా, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో వేర్వేరుగా ర్యాలీ చేపట్టారు. జవాన్లను స్మరిస్తూ, ఫ్లకార్డులను ప్రదర్శిస్తూ, కొవొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

- సిద్ది పేట కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి)

మల్లన్నసాగర్
ఉప కాల్వకు గండి
మల్లాయిపలి, దుబ్బాకకు రాకపోకలు బంద్

దుబ్బాక, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి) : మల్లన్నసాగర్ ఉప కాల్వకు గండి పడి నీరు వృథాగా పోయింది. వివరాల్లోకి వెళితే.. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి రైతులకు సాగునీరు అందించేందుకు 4ఎల్ డిస్ట్రిబ్యూటరీ కాల్వను నిర్మించారు. ఈ ఉపకాల్వ దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని మల్లాయపల్లి వార్డు శివారు నుంచి వెళ్తుంది. ప్రాజెక్టు నుంచి ఉప కాల్వ ద్వారా గోదావరి జలాలు పారుతున్నాయి. నీటి ప్రవాహ ధాటికి ఈ 4ఎల్ డిస్ట్రీబ్యూటరీ కాల్వకు గండి పడింది. దీంతో పెద్దఎత్తున నీరు వృథాగా పోతుంది. దీంతో సంబందిత అధికారులకు సమాచారం అందించారు. గండీ పడడంతో మల్లాయిపల్లికి దుబ్బాకకు రాకపోకలు నిలచిపోయాయి.


మల్లాయిపల్లి శివారులో మల్లన్నసాగర్ ఉప కాల్వకు పడిన గండి

సీఎంలు మారినా తలరాత మారలేదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఫాంహౌస్ పాలనతో సమస్యలు పరిష్కారం కావు : మెదక్ ఎంపీ రఘునందన్

కంది, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలన పోయి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా.. సీఎంలు మారారే కానీ ప్రజల తలరాత మారలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనులు, సాస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం కందిలో పట్టభద్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన 6 ప్రధాన గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీలు ఎక్కడని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు సంతోషంగా లేరని విమర్శించారు. గత 10 సంవత్సరాల్లో గ్రామ


మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

పంచాయతీలలో తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, శ్మశానవాటికలకు నిధులు ఇచ్చింది కేంద్ర ప్రభుత్వమేనని గుర్తుచేశారు. రానున్న రోజుల్లో తెలంగాణ అభివృద్ధికి మరిన్ని నిధులు ఇస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు బీజేపీ కృషి చేస్తుందని పేర్కొన్నారు. బీజేపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థులు కొమరయ్య, అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ గతంలో ఫాంహౌస్ పాలనతో.. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనతో ప్రజల సమస్యలు తీరడం లేదన్నారు. రాష్ట్రం పరిస్థితి పెనం పైనుంచి పొయ్యిలో పడ్డట్టు తయారైందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకే నాణానికి బొమ్మా బొరుసు లాంటివని విమర్శించారు. కాంగ్రెస్ మాటలు కోటలు దాటాయి కానీ, చేతలు తంగేళ్ల దాటడం లేదని దుయ్యబట్టారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వడం లేదన్నారు. అన్యాయంగా తొలగించిన 400 మంది ఎంఆర్ఎఫ్ పరిశ్రమ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, మాజీ ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్సీ అభ్యర్థులు కొమరయ్య, అంజిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీజీఐఐసీ కోసం భూసేకరణ
వేగవంతం చేయాలి
● కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీఐఐసీ)కు కేటాయించిన భూముల కోసం భూసేకరణ వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో టీజీఐఐసీ, రెవెన్యూ, సర్వే అధికారులు, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనుచౌదరి మాట్లాడుతూ మండలాల వారీగా తహసీల్దార్, సర్వే అధికారులు ప్రభుత్వ, పట్టా, అసైన్డ్ భూములను తనిఖీ చేయాలని ఆదేశించారు. భూసేకరణ పూర్తి కాగానే భూమి చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించుకోవాలని టీజీఐఐసీ అధికారులకు సూచించారు. భూసేకరణను డ్రోన్ ద్వారా కొలతలను తీసుకుంటే సులభంగా వేగంగా అవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ అనురాధ, డీజీఎం ఉమామహేశ్వర్, డీఈ జ్యోతి, డీఎం మహేశ్వర్ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

చేర్యాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):పెరిగిన డైట్‌చార్జీల ప్రకారం గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ మను చౌదరి సూచించారు. చేర్యాల మండలంలో కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించి కిచెన్, హాల్‌తో పాటు స్టోర్‌రూమ్, డైనింగ్‌హాల్‌ను సందర్శించారు.


గురుకులంలో సరుకులను పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతరం టెన్త్‌లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూంలోని వంట సరుకులను పరిశీలించారు. ప్రహరీ గోడ మరమ్మతులు, డార్మెటరీలో కిటికీల రిపేర్లు, రైస్ స్టీమ్ యూనిట్‌లకు ఈడబ్ల్యూఐడీసీ ద్వారా ప్రతిపాదనలు పంపించాలని ప్రిన్సిపాల్ పుల్లయ్యను ఆదేశించారు. అనంతరం ముస్త్యాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేసి ఆస్పత్రిలోని వివిధ గదులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతల వివరాలను సరిగ్గా నమోదు చేయాలని, ప్రభుత్వ ఆస్పత్రులలోనే ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు. వైద్యాధికారి సెలవులో ఉన్నారని సిబ్బంది తెలుపగా డీఎంహెచ్‌వోకు ఫోన్ చేసి నిర్ధారించుకున్నారు. ఫార్మసీలో మెడిసిన్ ఎక్స్‌పైరీ రిజిస్టర్ సరిగా మెయింటేన్ చేయక పోవడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. తహసీల్దారు కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్‌హౌజ్ నిర్మాణాలను పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయ భవనంలో నిర్వహిస్తున్న ఎస్సీ బాలుర హాస్టల్‌ను సందర్శించారు. ఆయన వెంట తహసీల్దారు సమీర్‌ఖాన్, ఎంపీడీవో మహమూద్ అలీ ఉన్నారు.

పొలాల నుంచి హైవే రోడ్డు వద్దు
● పలు గ్రామాల రైతుల ఆందోళన

కొండపాక, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట నుంచి సిరిసిల్లకు వెళ్లే 365బి జాతీయ రహదారి పనులు తమ పంట పొలాల నుంచి వేయవద్దంటూ కొండపాక మండలంలోని పలు గ్రామాల ప్రజలు రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఈ రోడ్డు నిర్మాణ పనుల కోసం రెండు రోజుల నుంచి అధికారులు సర్వే పనులను చేపట్టారు. ఈనెల 12న అధికారులు సర్వే చేసి హద్దులు గుర్తించగా, రైతులు అడ్డుకున్నారు. దీంతో నేషనల్ హైవే రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్, ఆర్అండ్‌బీ ఎస్ఈఈ బలరామ కృష్ణ శుక్రవారం సర్వేను పరిశీలించేందుకు వస్తున్నారని తెలుసుకుని, రైతులంతా ఉదయం 8 గంటల నుంచి తమ సమస్యలు తెలపడానికి సిద్ధమై ఉన్నారు. మధ్యాహ్నం 3.30 గంటల వరకు అధికారులు రాలేదు. డీఈ అన్నారెడ్డి మాత్రమే రాగా, రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి ఆందోళనకు దిగారు. తమ పంట పొలాల నుంచి రోడ్డు వేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రేపటి నుంచి టెంట్ వేసి ఆందోళన చేపడతామని


అధికారితో మాట్లాడుతున్న రైతులు

హెచ్చరించారు. తమ పంట భూములకు నష్టం చేయవద్దని డీఈకి వినతిపత్రం అందజేశారు. తొగుట సీఐ లతీఫ్, సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, ఎస్ఐ శ్రీనివాస్ రైతులను సముదాయించి పంపించివేశారు. కొంతమంది రైతులు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

భారీగా పోలీసుల మోహరింపు

జాతీయ రహదారి సర్వే పనులు అడ్డుకోవడంతో రైతులంతా జాతీయ రహదారి రీజినల్ అధికారులతో మాట్లాడేందుకు సమయం కేటాయించగా, కొండపాక మండలం జప్తి నాచారం వద్ద దుద్దెడ-తొగుట దారి మధ్యలో రైతులంతా సమావేశం అయ్యారు. జప్తి నాచారం, మర్పడగ, దుద్దెడ, ఖమ్మంపల్లి, బందారుపల్లి, తడకపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు అక్కడకు చేరుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉన్నారు. ఈ విషయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీగా చేరుకున్నారు. గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి, తొగుట సీఐ లతీఫ్, సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్‌తో పాటు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. తీరా పైస్థాయి అధికారులు రాకపోవడంతో పోలీసుల సూచనతో రైతులు వెళ్లిపోయారు.



పరిహారం చెల్లించాలంటూ అన్నదాతల ఆందోళన

చిన్నకోడూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : తమకు నష్ట పరిహారం చెల్లించాలని చిన్నకోడూరు మండలంలోని గంగాపూర్ రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం గ్రామ శివారులో రైల్వే లైన్ నిర్మాణ పనులను అడ్డుకొని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా ఏడాది క్రితం గ్రామానికి చెందిన 18 మంది రైతుల నుంచి సుమారు 10 ఎకరాల వ్యవసాయ భూమిని అధికారులు సేకరించారని తెలిపారు. పనులు ప్రారంభించిన పరిహారానికి సంబంధించి చెక్కులు అందజేయలేదన్నారు. ఈ విషయమై పలు మార్లు తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని వారు వాపోయారు. ఆందోళన విషయం తెలుసుకున్న చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని నిరసన తెలుపుతున్న రైతులతో మాట్లాడారు. ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు. సాయంత్రం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ మనుచౌదరి బాధిత రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

రైతు కూలీలకు బీమా వర్తింపజేయాలి

● డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

గజ్వేల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రైతు కూలీలకు బీమాను వర్తింపజేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. గజ్వేల్ మండల పరిధిలోని గిరిపల్లి గ్రామానికి చెందిన బండారి మల్లయ్య, ఆయన కుమారుడు బండారి రవిందర్ అప్పులబాధతో ఆత్మహత్య చేసుకోగా, వారి కుటుంబాన్ని శుక్రవారం ఆయన పరామర్శించారు.

రబ్బర్ బియ్యం కాదు.. ఫోర్టిఫైడ్ రైస్


గూడూరులో ఫోర్టిఫైడ్ రైస్‌ను తీసివేస్తున్న మహిళ

- పోషకాల మిళితం.. ఆరోగ్యదాయకం
- తెలియక వేరు చేస్తున్న కొందరు
- అవగాహన కల్పించని అధికారులు

శివ్వంపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రేషన్ బియ్యంలో ఫోర్టిఫైడ్(బలవర్ధక) రైస్‌ను కలిపి పంపిణీ చేస్తున్నది. సాధారణ బియ్యానికి పోషకాలను జోడించి అందిస్తున్నది. ఇవి బియ్యానికి కాస్త భిన్నంగా కనిపించడంతో చాలామంది వీటిని రబ్బర్ బియ్యంగా అపోహ పడుతూ తీసివేసి తింటున్నారు. ఈ విషయమై అవగాహన చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు. మండల పరిధిలోని గూడూరు గ్రామంలో శుక్రవారం ఓ మహిళ రేషన్ బియ్యంలోని ఫోర్టిఫైడ్ రైస్ వేరు చేస్తూ కనిపించింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫోర్టిఫైడ్ రైస్‌లో లభించే పోషకాలు, వాటిని తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నది. ఈ విషయమై స్థానిక తహసీల్దార్ కమలాద్రిని సంప్రదించగా ప్రజల్లో రక్త హీనత నివారణకు, రోగ నిరోధక శక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం సకల పోషకాలు కలిగిన బలవర్ధక బియ్యాన్ని రేషన్‌లో కలిపి అందిస్తుందన్నారు. ప్రజలెవరూ అపోహలు పడకుండా నిర్భయంగా వాటిని వండుకుని తినవచ్చునని తెలిపారు.



వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

ఉమ్మడి జిల్లాలో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు వ్యక్తులు మృతి చెందారు. చేగుంట మండలం చిన్నశివనూరు వద్ద ఇద్దరు సీఆర్పీలు దుర్మరణం చెందగా, తొగుట, మాసాయిపేట, బెజ్జంకిలో ఒకరు చొప్పున మృత్యువాత పడ్డారు.


రమేష్ నాయక్, శ్రీనివాస్(ఫైల్)

చేగుంట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సీఆర్పీలు మృతిచెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా చేగుంట మండ పరిధిలోని చిన్నశివనూర్ గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చేగుంట మండలంలోని గొల్లపల్లిజాత్రం తండాకు చెందిన రమేష్‌నాయక్ (40), చందాయపేట గ్రామానికి చెందిన ఎర్ర శ్రీనివాస్(44) మక్కరాజుపేట కాంప్లెక్స్ పాఠశాలల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులు(సీఆర్పీ)గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం పాఠశాలలో విధులు ముగించుకొని చేగుంటకు వస్తుండగా గజ్వేల్ వైపు వెళ్తున్న ట్రాలీ ఆటో వారి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో రమేష్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రగాయాలైన శ్రీనివాస్‌ను గజ్వేల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. రమేష్‌నాయక్ భార్య భూలక్ష్మి తండాలోని మినీ అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఎర్ర శ్రీనివాస్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బుల్లెట్ బండి ఢీకొని

తొగుట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. తొగుట ఎస్ఐ రవి కాంత్ కథనం ప్రకారం.. మండలంలోని తుక్కాపూర్ గ్రామానికి చెందిన దొంతి యాదగిరి(34) ఘనపూర్ నుంచి తుక్కాపూర్‌కు నడుచుకుంటూ వస్తున్నాడు. ఘనపూర్ శివారులోని కోళ్ల ఫారాల వద్దకు రాగానే వెనకాల నుంచి బుల్లెట్ బండిపై వస్తున్న శివంగి ప్రశాంత్ అతివేగంగా వచ్చి యాదగిరిని ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం సిద్దిపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోవడంతో అతడి మేనత్త గ్రామం తుక్కాపూర్‌లో నివాసముంటున్నాడు. అతడి మేనత్త లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ డివైడర్‌కు ఢీకొని..


రవి మృతదేహం

మాసాయిపేట. ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మాసాయిపేట లోని బంగారమ్మ గుడి ఎదురుగా 44 వ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్‌కు చెందిన బాయికాడి రవి (28) మరో ఇద్దరు స్నేహితులు శివకుమార్, భానుతో కలిసి బైక్‌పై తూప్రాన్ వైపు వెళ్తున్నారు. దీంతో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొనడడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా బాయికాడి రవి(28) మార్గమధ్యలోనే మృతి చెందాడు. శివకుమార్, భాను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట పోలీసులు తెలిపారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని..


అభిషేక్ (ఫైల్)

బెజ్జంకి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని రేగులపల్లి స్టేజీ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కరీంనగర్ జిల్లా మానకొండూరుకు చెందిన అభిషేక్(23), అతని బంధువు భానుప్రసాద్ ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంపై వస్తూ రేగులపల్లి స్టేజి వద్ద కరీంనగర్ వైపు వెళ్లేందుకు యూటర్న్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో సిద్దిపేట నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న మరో ద్విచక్రవాహనం యూటర్న్ తీసుకుంటున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన అభిషేక్, భానుప్రసాద్, అభినయ్‌ను 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అభిషేక్ మృతి చెందాడు. తీవ్ర గాయాలైన భానుప్రసాద్, అభినయ్‌ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

పుస్తకాలతో కుస్తీ వద్దు..

దోస్తీ చేద్దాం



- పరీక్షల కాలం.. ప్రణాళికతో చదవాలంటున్న నిపుణులు
- ఆట, పాటల జోలికి వెళ్లొద్దు
- మానసిక ఒత్తిడిని అధిగమించాలి
- ఆహారపు నియమాలు తప్పనిసరి

మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఏడాదంతా సంతోషంగా ఆట, పాటలతో సమయం తెలియకుండా గడిపిన విద్యార్థుల్లో పరీక్షలు మొదలవుతున్నాయంటే చాలు ఒక్క సారిగా టెన్షన్ మొదలవుతుంది. ఇన్నాళ్లు ఒక ఎత్తయితే ఇప్పుడు చదివి, రాసేది మరో ఎత్తు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా పరీక్షకు సన్నద్ధమవుతే విజయం సులువు అవుతుందని పలువరు నిపుణులు సూచిస్తున్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 5 నుంచి 25 వరకు, పదోతరగతి పరీక్షలు మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరగనున్నాయి. కాబట్టి విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పట్టి చదివి, పగలు, రాత్రి అని తేడా లేకుండా చదివితే గతంలో చదివిన అంశాలను కూడా మర్చిపోయే ప్రమాదముందని నిపుణులు చెబుతున్నారు. అలా కాకుండా పుస్తకాలతో దోస్తీ చేస్తూ ఒక ప్లాన్ ప్రకారం చదువాలని సూచిస్తున్నారు. అలాగని మరి ఒత్తిడి, నిద్రలేమితో చదువుతూనే ఉండటం వలన మొదటికే మోసం వస్తుందని హెచ్చరిస్తున్నారు. ముందుగా పరీక్ష అనే భయాన్ని తొలగించుకోవాలని సూచిస్తున్నారు. అంతేకాకుండా పరీక్ష రాసే విధానం, ఆహార నియమాలపై వారు పలు సలహాలు, సూచనలు చేస్తున్నారు.

నిపుణుల సూచనలివివే..

- మసాలా, కారం ఆహార పదార్థలకు దూరంగా ఉండాలి. వీటివల్ల దాహం ఎక్కువగా అయ్యి ఏకాగ్రతకు ఆటంకం కలుగుతుంది.
- వేసవి దృష్ట్యా మజ్జిగ, నిమ్మరసం, గ్లూకోస్ వాటర్ తరచూ తీసుకుంటుండాలి.
- ఆహారాన్ని మితంగా తీసుకోవాలి. అధికంగా తినడంవల్ల నిద్ర వచ్చి ఏకాగ్రత నశిస్తుంది.
- చదువుకొనే గదిని ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలి. పుస్తకాలు మాత్రమే ఉంచుకోవాలి. ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలి.
- పాత ప్రశ్న పత్రాలను తిరిగేయాలి. సమాధానం దొరకని, అర్థం కాని ప్రశ్నలుంటే ఉపాధ్యాయుల సలహాలు తీసుకోవాలి.

చేతి రాత ఇలా ఉండాలి..

- జవాబు రాసే తీరు పరీక్ష పేపర్ దిద్దే ఉపాధ్యాయుడికి అర్థమయ్యేలా ఉండాలి.
- ఒక పేజీలో 18 నుంచి 19 లైన్లకు మించి రాయకూడదు. అప్పుడే నీట్‌గా కనబడుతుంది.
- మొదటి లైన్ రాసే ముందు మార్జిన్ చుస్తూ రాయాలి. లేకపోతె మిగతా లైన్లు వరుసక్రమంలో ఉండవు. వరుస ముగింపుతోనే పూర్తి పదం ఉండేలా చూసుకోవాలి.
- అంకెలు రాసేముందు స్పష్టతగా ఉండేలా చూసుకోవాలి. లేకుంటే అర్థంకాక మార్కులు తగ్గించే అవకాశం ఉంటుంది.
- సామాన్య శాస్త్రంలో బొమ్మలు గీస్తే ఆ చిత్రంలోని భాగాలు గుర్తించడంలో ఒక క్రమ పద్ధతి పాటిస్తే బాగుంటుంది.
- బ్రాకెట్లలో రాసే ఏబీసీడీలు పెద్ద అక్షరాలే రాయాలి. గణిత పరీక్ష రాసేటప్పుడు అంకెలు సక్రమంగా వేయాలి.
- వ్యాకరణ దోషాలు లేకుండా జాగ్రత్తపడాలి.
- జవాబు మొదలు పెట్టిన స్థలం నుండి చివర స్థలం వరకు సమాంతరంగా రాయాలి, పైకి, కిందకి వెళ్లకూడదు. క్రమంగా లేకుంటే ఆన్సర్ పేపర్ ఆకర్షణీయంగా కనబడదు.

ప్రణాళికతో చదివితే విజయం మీదే..



పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయి. ముందుగా పరీక్ష ఎలా రాయాలి అనే విషయాలపై అవగాహనా పెంచుకోవాలి. పటాలను గీయడం వాటి భాగాలు క్రమ పద్దతిలో రాయడం, గత ప్రశ్న పత్రాలను తప్పకుండా పరిశీలించాలి. సందేహాలుంటే ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలి. ఫైనల్ పరీక్షలకు ముందుగా వచ్చే ప్రీ ఫైనల్ పరీక్షలలో తప్పులను సరిదిద్దుకొని, చివర పరీక్షలకు సంసిద్ధమైతే అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చు.

-సురేష్ ,మానసిక వైద్య కౌన్సిలర్

సమయాన్ని సద్వినియోగించుకోవాలి



పరీక్షా గదిలో ఆ మూడు గంటల సమయాన్ని సరిగా సద్వినియోగం చేసుకుంటే మార్కులు రావడం అంత కష్టమైన పనేం కాదు. పరీక్షల్లో ఎలాంటి తొందరపాటు లేకుండా ముందుగా ఇచ్చిన ప్రశ్న పత్రాన్ని క్షుణ్ణంగా చదివి ఆ తరవాతే సమాధానాలు రాయాలి. మూల్యాంకనం చేసే వారికి అర్థం అయ్యే విధంగా రాత ఉండాలి. పరీక్షకు వెళ్లే గంట ముందు నుండి చదవకుండా ప్రశాంతంగా ఉండాలి. పరీక్షా సమయంలో ఏ విభాగానికి ఎంతెంత సమయం కేటాయించాలో ముందే ప్రణాళిక సిద్ధం చేయనుకోవాలి.

-అంజా గౌడ్,
ప్రభుత్వ ఉపాధ్యాయుడు, పాపన్న పేట

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్


విధ్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

హవేళిఘణపూర్, ఫిబ్రవరి14 (ఆంధ్యజ్యోతి) : పదోతరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ రాహుల్ రాజ్‌సూచించారు. శుక్రవారం మండలంలోని భూర్గుపల్లి ప్రభుత్వ న్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. కలెక్టర్ విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది పరీక్షల సమయం కావడంతో టీవీ, ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎంఈవో మధుమోహన్, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

డంపుయార్డుకు వ్యతిరేకంగా ట్రాక్టర్ల ర్యాలీ

● పోలీసులకు రైతు జేఏసీ నాయకుల మధ్య తోపులాట


రైతు జేఏసీ నేతల ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలంలో ప్యారానగర్ లో ఏర్పాటు చేయబోతున్న డంప్‌యార్డ్‌ను వ్యతిరేకిస్తూ చేపట్టిన ఉద్యమం ఉధృతంగా కొనసాగుతుంది. జేఏసీ ఆధ్వర్యంలో పది రోజులుగా నిరసనలు చేపడుతున్నారు. శుక్రవారం జేఏసీ చైర్మన్ చిమ్ముల జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు భారీ సంఖ్యలో జాతీయ రహదారిపై ట్రాక్టర్ల ర్యాలీ తీసి నిరసన తెలిపారు. వీరిని అడ్డుకునే ప్రయత్నంలో పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట జరిగింది. అనంతరం టోల్గేట్ సమీపం వరకు ట్రాక్టర్ల ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డంపుయార్డును ఏర్పాటు చేయొద్దంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మరోవైపు కొత్తపల్లి నల్లవల్లి గ్రామాల్లో డంపుయార్డును ఏర్పాటు చేయొద్దని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మల్లయ్య మృతదేహం

అల్లాదుర్గం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన అల్లాదుర్గం మండలంలోని సీతానగర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కాయిదంపల్లి గ్రామానికి చెందిన ముసిరిగారి మల్లయ్య(50) ఈ నెల 13న ఉదయం ఇంటి నుంచి బయటికెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం సీతానగర్ గ్రామ శివారులోని ఒకరి వ్యవసాయ భూమి వద్ద మల్లయ్య మృతదేహం లభ్యమైంది. మృతుడి కుమార్తె భేతమ్మ ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మల్లయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నీట మునిగి..


పోచయ్య(ఫైల్)

హవేళిఘణపూర్, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి) : బావి నీటిలో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శమ్నాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి పోచయ్య(38) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం పొలానికి నీరు పెట్టేందుకు కుమారుడు జయంత్‌తో కలిసి వెళ్లాడు. బావిలోని మోటారు పనిచేయకపోవడంతో అందులోకి దిగి పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. ఎంతసేపటికీ పోచయ్య బావిలో నుంచి బయటకు రాకపోవడంతో అతడి కుమారుడు జశ్వంత్ తన చినాన్న శంకర్‌కు సమాచారం అందించాడు. దీంతో అక్కడికి చేరుకున్న గ్రామస్థులు బావిలో నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాజు తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కుంటలో పడి..


జయరాములు (ఫైల్)

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పిడిచేడు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గద్ద జయరాములు(51)కు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం సాయంత్రం పోల్కమ్మకుంట సమీపంలో బహిర్భూమికని వెళ్లి ఎంతసేపటికి తిరిగి రాలేదు. దీంతో అతడి భార్య తన బావ బక్కాయి రాములుతో కలిసి కుంటవద్ద, చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. కాగా, శుక్రవారం మధ్యాహ్నం బక్కాయి రాములు బర్రెలను తీసుకొని పోల్కమ్మ కుంటకు వెళ్లగా జయరాములు కుంటలో శవమై తేలాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

జిన్నారం, ఫిబ్రవరి 14 (ఆంధజ్యోతి): పెద్దవాగు నీటిలో వ్యక్తి మృతదేహం లభించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మాదారం పరిధి దువ్వకుంట గ్రామ శివారులోని పెద్దవాగునీటిలో శుక్రవారం వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ రవీందర్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డులో పేరు గౌతమ్ గైక్వాడ్ (38), మహరాష్ట్రలోని నవజీవన్ ఆర్వో నంబర్ 1106, బుద్ధవిహార్, తాలుకా వాసాయ్ పాలిఘర్ చిరునామా ఉన్నది. కాగా, మృతుడు ఎక్కడ నివసిస్తున్నాడు, ఆయన మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఏఐతో అనేక మార్పులు

● జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహ


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నరసింహ

పుల్‌కల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)తో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జి.నర్సింహ అన్నారు. కృత్రిమ మేధ (ఏఐ)పై రెండు రోజుల పాటు నిర్వహంచనున్న అవగాహన సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా, విద్య, వ్యవసాయ రంగాలతో పాటు డిజటల్ విధానంలో పలు రకాల మార్పులకు ఏఐ ఉపయోగపడుతుందన్నారు. అందుకనుగుణంగా విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాల లభ్యత కనుమరుగవుతున్న తరుణంలో సొంతంగా స్టార్టప్ కంపెనీలు పెట్టడానికి ఏఐ సాఫ్ట్‌వేర్ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. హైదరాబాద్‌లో ఏఐ కేంద్రం ఏర్పాటు శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఈవీ ప్రాజెక్టు ఇంజనీరింగ్ హరీశ్‌సాత్విక్ వర్మ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.రాఘవేందర్‌రావు, సీఎస్ఈ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దంగల్

5వ పేజీ తరువాయి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు ఎంపీ రఘునందన్, పార్టీ ముఖ్య నేతలు ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ టికెట్ ఆశించిన ప్రసన్న హరికృష్ణ బీఎస్పీ నుంచి పోటీలో ఉన్నారు. కరీంనగర్ మేయర్‌గా పనిచేసిన బీఆర్ఎస్ నేత సర్దార్ రవీందర్‌సింగ్ ఫార్వర్డ్ బ్లాక్ నుంచి బరిలోకి దిగారు. బీఆర్ఎస్ ముఖ్య నేతలతో సన్నిహిత సంబంధాలున్న యాదగిరి శేఖర్‌రావు సైతం స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల సంఘాల నేతగా ఆయనకు పేరుంది. వీరితోపాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోరు గరంగరం

సిట్టింగ్ ఎమ్మెల్సీగా ఉన్న కూర రఘోత్తమరెడ్డి స్థానంలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం వంగ మహేందర్‌రెడ్డిని బరిలోకి దింపింది. సామాజిక కార్యక్రమాలతోపాటు సంఘంలో సత్సంబంధాలు కొనసాగిస్తారని ఆయన పేరు ఖరారు చేశారు. నాలుగు నెలల ముందు నుంచే ఆయన ఉపాధ్యాయ ఓటర్ల నమోదు, ప్రచారంపై దృష్టిపెట్టారు. రఘోత్తమరెడ్డి సైతం పలు సంఘాల మద్దతుతో మరోసారి పోటీచేస్తూ తననే గెలిపించాలని, వేరేవారికి ఓట్లు వేయవద్దని కోరుతున్నారు. గత ఎన్నికల్లో రఘోత్తంరెడ్డి వెంట ఉన్నవారిలో చాలా మంది సంఘం నేతలు ప్రస్తుతం వంగ మహేందర్‌రెడ్డి గెలుపు కోసం శ్రమిస్తున్నారు. ప్రధాన పార్టీల్లో బీజేపీ మాత్రమే మల్క కొమురయ్యను బరిలోకి దింపగా ఆయన విస్తృతంగా పర్యటిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల ఓట్లపై ట్రస్మాట్ పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి దృష్టిపెట్టారు. ఇతర అభ్యర్థులు వారివారి ఉపాధ్యాయ సంఘాలు, ప్రైవేట్ టీచర్ల మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు.



భారీ ర్యాలీగా తరలి.. కాంగ్రెస్‌లో చేరిక

రామాయంపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట ఉమ్మడి మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం రాత్రి వివిధ గ్రామాల నుంచి వచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలు ఊరేగింపుగా ఫంక్షన్‌హాల్‌కి తరలివెళ్లి మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత్‌రావు, రమేష్‌రెడ్డి, రాంచందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లారీ కంటైనర్‌ను బైక్ ఢీ.. వ్యక్తికి తీవ్ర గాయాలు

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): లారీని బైక్ ఢీకొని వ్యక్తి గాయాలైన సంఘటన పట్టణంలోని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బెజుగామ గ్రామానికి చెందిన రొయ్యల నర్సింహులు బైక్‌పై ప్రజ్ఞాపూర్ నుంచి పిడిచెడు వెళ్తున్నాడు. మూలమలుపు వద్ద తిరిగే క్రమంలో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రజ్ఞాపూర్ నుంచి తూప్రాన్‌కు వెళ్తున్న లారీ కంటైనర్‌ను బైక్ ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు అతడిని వెంటనే చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకోరా?


సిద్దిపేట-మెదక్ రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న బావులు


ఇర్కోడు శివారులో రోడ్డు పక్కనే ఉన్న బావి


సిద్దిపేట-సిరిసిల్ల రోడ్డులో గుర్రాలగొంది శివారులో రోడ్డు పక్కనే సైడ్‌వాల్ లేని బావి

- ప్రధాన రోడ్ల పక్కనే వ్యవసాయ బావులు
- కనిపించని రక్షణ గోడలు, సూచిక బోర్డులు
- గతంలో ట్రాక్టర్ దూసుకెళ్లి ఓ రైతు మృతి
- అయినా పట్టించుకోని అధికారులు
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్ల పక్కన వ్యవసాయ బావులు వాహనదారుల పాలిట ప్రమాదకరంగా పరిణమించాయి. ఏటా వర్షాకాలంలో కొద్దికొద్దిగా కూలుతూ బీటీ రోడ్డును తాకేలా విస్తరించినా వాటి వద్ద రక్షణ గోడల నిర్మాణం విషయమై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో కనీసం సూచికబోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. దీంతో రాత్రిపూట ఆయా రహదారుల్లో ప్రయాణించాలంటే వాహనదారులు జంకే పరిస్థితి నెలకొన్నది. వివరాల్లోకి వెళ్తే..

పొదలమాటున..

సిద్దిపేటరూరల్, నారాయణరావుపేట మండలాల్లోని ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్ల పక్కన చెట్లపొదలు ఏపుగా పెరిగిపోవడంతో బావులు కనిపించకుండా ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు ముఖ్యంగా రాత్రి సమయాల్లో అదుపు తప్పితే బావుల్లోకి దూసుకుపోయి ప్రమాదం జరిగే అవకాశం నెలకొన్నది. నూతనంగా వేస్తున్న జాతీయ రహదారి పక్కన ఎన్నో బావులు ఉన్నాయి. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రమాదం అని తెలిసినా అధికారులకు పట్టింపేలేదని వాహనదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా వెళ్లే వాహనదారుల పాలిట రోడ్డుపక్కనే బావులు ప్రాణాంతకంగా మారాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వాహనదారులకు శాపంగా మారకముందే తగిన చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదకర ప్రాంతాలు

● సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు నుంచి బుర్గుపల్లి మధ్యన జాతీయ రహదారికి ఇరువైపులా ప్రమాదకరంగా బావులకు ఆనుకుని రోడ్డు పక్కనే ఉన్నాయి.

● ఇర్కోడు నుంచి బుస్సాపూర్ వెళ్లే రోడ్డు మార్గంలో బావికి సైడ్‌వాల్ లేకపోవడంతో వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. సమీపంలోకి వచ్చేవరకూ బావి ఉన్నట్లు తెలియని ప్రమాదకర పరిస్థితిలో ఉన్నాయి.

● రాంపూర్ గ్రామ శివారులో రోడ్డును ఆనుకుని ఉన్న బావికి రైతులే ప్రమాదం జరగకుండా తాత్కాలికంగా కంచె ఏర్పాటు చేసుకున్నారు.

● సిద్దిపేట, సిరిసిల్ల రోడ్డులో గుర్రాలగొంది శివారులో రోడ్డు పక్కనే ఉన్న బావికి సైడ్‌వాల్ లేక ప్రమాదకరంగా ఉంది. గతంలో ఓ కారు అదుపుతప్పి బావిలోకి దూసుకెళ్లగా అదృష్టవశాత్తు స్వల్పగాయాలతో అందులోనివారు బయటపడ్డారు.

● మాటిండ్ల నుంచి నారాయణరావుపేట మండల కేంద్రానికి వచ్చే మార్గంలో సైతం ఆర్అండ్‌బీ రోడ్డుకు దగ్గరగా మూడు చోట్ల ప్రమాదకరంగా బావులున్నాయి. గతంలో ట్రాక్టర్‌తో పాటు డ్రైవర్, రైతు బావిలో పడిన సంఘటనలో రైతు మరణించాడు. అప్పట్లో సైడ్‌వాల్ నిర్మించినప్పటికి రోడ్డు విస్తరణ సమయంలో బావి యథావిధిగా రోడ్డుకు సమాంతరంగా మారింది. సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లో చాలా చోట్ల రోడ్డుకు పక్కనే బావులు ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఆయా ప్రదేశాల్లో సైడ్‌వాల్స్ నిర్మించాలని కోరుతున్నారు.

సైడ్ వాల్స్ నిర్మాణం చేపట్టాలి



రోడ్డు ప్రక్కనే ప్రమాదకరంగా ఉన్న బావులను గుర్తించి సూచిక బోర్డులు, సైడ్ వాల్స్ నిర్మాణం చేపట్టాలి. సిద్దిపేట మెదక్ రోడ్డులో ప్రమాదకరంగా రోడ్డుకు అనుకోని బావులు ఉన్నాయి. జాతీయ రహదారి నిర్మాణం చేస్తున్నారు. ముందస్తుగా సైడ్ వాల్స్ నిర్మాణం చేయకుండానే బీటీ రోడ్డు వేశారు. అధికారులు గుర్తించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి.

- మామిడాల కనకయ్య, ఆటో డ్రైవర్

రెండు బైక్‌లు ఢీ ఒకరికి గాయాలు

చేర్యాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని దానంపల్లికి చెందిన బండి కనకయ్య బైక్‌పై చేర్యాలకు వస్తుండగా పోలీస్ స్టేషన్ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న మరో బైక్‌తో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో కనకయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించి సీఐ శ్రీను వెంటనే స్పందించి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆటోలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నాచారంలో వివాహిత అదృశ్యం


కృష్ణవేణి

వర్గల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచారం గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైంది. గౌరారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాచారం గ్రామానికి చెందిన ఆకుల కృష్ణవేణి(27) గత నెల 28వ తేదీన కూతురును స్కూల్ వద్ద దింపడానికి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. భర్త, కుటుంబసభ్యులు చుట్టు పక్కల గ్రామాల్లో ఆమె కోసం వెతికినా ఫలితం లేకపోయింది. అమె ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

నేటి నుంచి నంగునూరులో బ్రహ్మోత్సవాలు

నంగునూరు, ఫిబ్రవరి 14: నంగునూరు తోకలకొండపై శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ కోల రమేశ్ గౌడ్ తెలిపారు. 15న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ ప్రత్యేక పూజలు, 16న శకటోత్సవం (బండ్లు తిరుగుట), 17న సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం అనంతరం అన్న ప్రసాద వితరణతో పాటు రాత్రి బెజ్జంకి కళాకారుల బృందంచే ఒగ్గు కథ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. బ్రహ్మోత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి


మోడల్‌స్కూల్‌లో తల్లిదండ్రుల కాళ్లు కడుగుతున్న విద్యార్థులు

సిద్దిపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలని మిరుదొడ్డి మోడల్ స్కూల్‌స్కూల్ ప్రిన్సిపాల్ అర్చన ప్రియదర్శిని పేర్కొన్నారు. శుక్రవారం మిరుదొడ్డిలో మోడల్‌స్కూల్‌లో తల్లిదండ్రుల పూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులను గౌరవించినప్పుడే సమాజం బాగుపడుతుందని తెలిపారు. పూజోత్సవ కార్యక్రమంలో విద్యార్థులు తమ తల్లిదండ్రుల కాళ్లను కడిగారు.

జడ్పీ పాఠశాలలో ఆర్డీవో ఆకస్మిక తనిఖీ

మర్కుక్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులపై ప్రధానోపాధ్యాయుడు వెంకటేశంతో మాట్లాడారు. అనంతరం 10వ తరగతి గదిలో విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచించారు. వారి వెంట మర్కుక్ తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి, ఆర్ఐ శ్రీధర్, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు సమయాన్ని వృథా చేయొద్దు

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపించినందున తల్లిదండ్రులు ఇంటి వద్ద విద్యార్థులకు పనిని అప్పగించకుండా వారిని చదువుపై దృష్టి సారించే విధంగా చూడాలని ఎంఈవో మాధవరెడ్డి పేర్కొన్నారు. గురు, శుక్రవారాల్లో మండలంలోని ఇటిక్యాల జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వర్ధరాజ్‌పూర్, ఎర్రవల్లి గ్రామాలకు చెందిన విద్యార్థుల ఇళ్లను సందర్శించి వారి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ డే


మోడల్‌స్కూల్‌లో తల్లిదండ్రుల కాళ్లు కడుగుతున్న విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు రోజుల నుంచి విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, డ్రాయింగ్, స్పెల్లింగ్ టెస్ట్, డ్రామాలు, సాంగ్స్ కాంపిటీషన్ ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు నీలకంఠ మనోహర్ తెలిపారు. ప్రథమ, ద్వితీయ స్థానాలను పొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. స్టాఫ్ సెక్రెటరీ ఉదయశ్రీ, ఆంగ్ల ఉపాధ్యాయులు కోట ప్రభు, శ్రీనివాస్ గౌడ్, పద్మలత ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు.

తపాస్‌పల్లి నీటితో చెరువులను నింపాలి

కొండపాక, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలంలోని చెరువులకు నీటిని తరలించాలని పలువురు రైతులు సిర్సనగండ్ల మాజీ సర్పంచ్ గూడెపు లక్ష్మారెడ్డి అధ్వర్యంలో డీఈ అంజయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం పలువురు రైతులు తపాస్‌పల్లి రిజర్వాయర్ వద్దకు వెళ్లి అధికారులతో మాట్లాడి తమ గ్రామాల చెరువులు నింపాలని కోరారు. అందుకోసం ప్రత్యామ్నాయంగా మరో గేటు తాను ఏర్పాటు చేస్తానని లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ డి ఫోర్ కెనాల్ ద్వారా కొండపాక, సిరసనగండ్ల, మర్పడగ, దమ్మకపల్లి తదితర గ్రామాల చెరువులకు కాలువల ద్వారా నీటిని అందించాలని కోరారు. ఆల్టర్నేట్ గేటు లేకపోవడంతో తమ చెరువుల కు నీరు అందడం లేదని లక్ష్మారెడ్డి తెలిపారు.

నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠినచర్యలు

మిరుదొడ్డి,ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎవరైనా సరే నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని దుబ్బాక వ్యవసాయ సంచాలకులు మల్లయ్య హెచ్చరించారు. శుక్రవారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ పర్టిలైజర్ యజమాని ఎరువులను ఎఆర్‌పీ ధరలకు మాత్రమే విక్రయించాలని సూచించారు. నకిలీ విత్తనాలకు విక్రయించే వారిపై పీడీయాక్ట్ కేసును నమోదు చేస్తామని హెచ్చరించారు.

బీసీ రిజర్వేషన్ల అమలుకు కేంద్రం సహకరించాలి

హుస్నాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : బీసీల 42 శాతం రిజర్వేషన్ల అమలుకు చట్టబద్ధత కల్పించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి కేంద్రం సహకరించాలని బీసీ ఐక్య వేదిక నాయకులు కోరారు. శుక్రవారం వారు హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో చెప్పిన విధంగా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీ కుల గణన బిల్లులకు అమోదం తెలపడంతో పాటు అన్ని రంగాల్లో బీసీలకు సామాజిక న్యాయం జరిగేలా 42 శాతం రిజర్వేషన్ల అమలుకు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. ఈ రిజర్వేషన్లకు సంబంధించి మార్చి నెలలో కేంద్రానికి పంపనుండటంతో దానికి అమోదం తెలపాలని కోరారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, నియోజకవర్గ జేఏసీ కో ఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్, బీసీ ఐక్య వేదిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సులకు ప్రత్యేక డిస్కౌంట్

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అద్దె బస్సులకు వివాహాది శుభకార్యాలకు, విజ్ఞాన విహారయాత్రలకు, తీర్థయాత్రలకు తీసుకెళ్లేవారికి ప్రత్యేక డిస్కౌంట్ ఉంటుందని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ పవన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలకు తక్కువ ధరకే రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో 10 నుంచి 20 శాతం వరకు రాయితీ ఇస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. వివరాలకు 9347252659, 9959226270 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

మాజీ జడ్పీటీసీ మాతృమూర్తికి ప్రముఖుల నివాళి

ధూళిమిట్ట,ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): మద్దూర్ మండల మాజీ జడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి మాతృమూర్తి గిరి మధురమ్మ అంత్యక్రియలు శుక్రవారం వారి స్వగ్రామం జాలపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పార్టీలకు చెందిన ప్రముఖులు మృతదేహంపై పూలమాల ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అంత్యక్రియల్లో పాల్గొని గిరి కొండల్‌రెడ్డి కుటుంబీకులను ఓదార్చారు. నివాళులర్పించినవారిలో సిద్దిపేట జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వేలేటి రోజారాధాక్రిష్ణశర్మ, మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం గౌడ్, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు రాకేష్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, పలు పార్టీల నాయకులు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌కు మాతృ వియోగం

చేర్యాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మాజీ సర్పంచ్ పడిగన్నగారి మల్లేశం మాతృమూర్తి జానమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించి సంతాపం తెలిపారు.

విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ

చేర్యాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్త్యాల గ్రామ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులను కోల్పోయిన పేద విద్యార్థులకు క్రామెడ్ కొంగరి నారాయణ స్మారక విజ్ఞాన సేవా సంఘం ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు వైట్ యూనిఫామ్స్‌ను శుక్రవారం ట్రస్టు అధ్యక్షుడు వెంకట్‌మావో అందజేశారు.

కార్మికుడి పై దాడి చేసినవారిని శిక్షించాలి


ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కొండపాక, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కొండపాక గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సిబ్బంది నర్సింహులు పై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీవో కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. విధులు నిర్వహిస్తున్న నరసింహులుపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ నరసింహులుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవో, ఎంపీవో అధికారులతో చర్చించారు. గ్రామపంచాయతీ సిబ్బందికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి, జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల నర్సయ్య, బర్మ కొమురయ్య, జాలిగామ ప్రభాకర్, పల్లె శ్రీనివాస్, ఆరుట్ల నర్సింలు, గొడుగు నారాయణ,సుధాకర్, కొమ్ము ఆంజనేయులు, గణేష్, కుమారు, నరసింహాచారి, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణపై పకడ్బందీగా వ్యవహరించాలి


ఫంక్షన్‌హాల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న కమిషనర్

గజ్వేల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): చెత్త నిర్వహణలో ఫంక్షన్‌హాల్ నిర్వాహకులు పకడ్బందీగా వ్యవహరించాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య సూచించారు. గజ్వేల్ పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం మునిసిపాలిటీ పరిధిలోని ఫంక్షన్‌హాల్ నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్త వేరు చేసి డంపింగ్‌యార్డుకు తరలించేందుకు, ప్లాస్టిక్ నిషేధం, చెత్త నిర్వహణపై చర్చించారు. అంతేకాకుండా ఆస్తి పన్ను, యూజర్ చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులను చెల్లించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించినట్లయితే ఫంక్షన్‌హాళ్ల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారితో సానిటరీ ఇన్‌స్పెక్టర్ రవిందర్ తదితరులున్నారు.

'వృక్షార్చన'ను జయప్రదం చేయాలి


గజ్వేల్ క్యాంపు కార్యాలయంలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

గజ్వేల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న వృక్షార్చన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వృక్షార్చన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో చేపడుతున్న వృక్షార్చన కార్యక్రమాన్ని నియోజకవర్గంలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతీ తెలంగాణవాది మూడు మొక్కలను నాటాలని ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన వెంట మునిసిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, నాయకులు నవాజ్‌మీరా తదితరులున్నారు.

రేపు సిద్దిపేటలో అష్టావధాన సాహిత్య కార్యక్రమాలు

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16 ఆదివారం రోజున హరిహరా రెసిడెన్సి సమీపంలో గల లలితాచంద్రమౌళీశ్వర ఆలయ మాసోత్సవాల్లో భాగంగా అష్టావధాని మారెపల్లి పట్వర్ధన్ శతావధానిచే పది అష్టావధాన సాహిత్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అంతేకాకుండా దేవతామూర్తుల అభిషేకం, అన్నదాన, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.. అష్టావధానం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని, రాష్ట్రస్థాయి కవులు పాల్గొననున్న సందర్భంగా సిద్దిపేట జిల్లాలోని సాహితీ ప్రియులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు పండరి రాధాకృష్ణ, బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం కోరారు.

ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదు

● జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నాట్లు అయిపోయి సాగు నీళ్ల కోసం రైతులు తండ్లాడుతుంటే అధికారులకు, ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం పత్రికా ప్రకటన ద్వారా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజూ రైతులు తనకు సమస్యలు చెబుతుంటే నీటి పారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నానని తెలిపారు. ఎలాంటి చర్యలు తీసుకోకపోగా అన్ని పంపులను బంద్ చేశారని మండిపడ్డారు. వెంటనే అన్ని పంపులను ఆన్ చేసి రిజర్వాయర్, చెరువులను నింపి రైతులకు సాగునీరందించాలని నియోజకవర్గ రైతుల తరపున విజ్ఞప్తి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కోరారు. లేనిపక్షంలో రైతులతో కలిసి నిరసన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

ఉపాధ్యాయులు, అధ్యాపకుల గొంతుకనవుతా


సమావేశంలో మాట్లాడుతున్న వై. ఆశోక్ కుమార్

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై స్పష్టమైన అవగాహన అనుభవం కలిగిన వ్యక్తి అశోక్ కుమార్‌ని గెలిపించుకోవలసిన బాధ్యత ఉపాధ్యాయులు, అధ్యాపకులపై ఉందని టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర, సిద్దిపేట జిల్లా నాయకులు కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థి వై.అశోక్ కుమార్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయించి ఓపీఎస్ పునరుద్ధరణ చేయిస్తామని, 317 జీవో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు కనీస వేతన అమలు చేయిస్తామని చెప్పారు. సమావేశంలో టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ .అనిల్ కుమార్, ఎస్సీ ఎస్టీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొంగల్ వెంకట్, టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి తిరుపతిరెడ్డి, టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి, లెక్చరర్స్ యూనియన్ నాయకులు రాజు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీహెచ్ విజేందర్‌రెడ్డి, సుంచు నరేందర్, ఎస్సీ, ఎస్టీ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సురేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు

సమస్యలపై పోరాడుతా


సమావేశంలో మాట్లాడుతున్న మందజ్యోతి

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల నిరుద్యోగ సమస్య, విద్య వైద్యం, ఉపాధి అంశాల మీద శాసనమండలిలోప్రభుత్వంపై పోరాడుతానని ధర్మసమాజ్ పార్టీ పట్టాభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మంద జ్యోతి పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సదన్ మహారాజ్‌తో కలిసి మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టే మాటలు చెబుతాయని విమర్శించారు. ఆ పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బీసీ, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు ఎందుకు బిఫామ్ ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం చేపట్టిన కుల గణన ప్రకారం 90శాతం బీసీ, ఎస్సీ ఎస్టీ ప్రజలు ఉన్నారని, ఆ ప్రకారం టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ తరఫున తనకు అవకాశం ఇచ్చినందుకు రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి రవిబాబు, జిల్లా నాయకులు బుగ్గ రాజు ప్రసన్న, ఎల్లన్న, సతీష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


గజ్వేల్‌రూరల్: సింగాటం ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలనలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



కుకునూరుపల్లి: జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు నాయకత్వ లక్షణాలపై వివరిస్తున్న ఎంఈవో సత్తయ్య


చేర్యాల: పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు


నంగునూరు మండలం బద్దిపడగ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సర్కారు బడుల్లో 'స్వయంపాలన'

గజ్వేల్ రూరల్/మర్కుక్/కుకునూరుపల్లి/చేర్యాల/నంగునూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు పాఠశాలల్లో శుక్రవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. స్వయంపాలన కార్యక్రమంలో విద్యార్థుల్లో నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించి వారిలో ఆత్మస్థైర్యం నింపుతుందన్నారు. గజ్వేల్ మండలంలోని సింగాటం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన స్వయంపాలన దినోత్సవానికి ముఖ్య అతిథులుగా అహ్మదీపూర్ ప్రధానోపాధ్యాయుడు సుగుణాకర్, స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్‌రెడ్డి హాజరయ్యారు. మర్కుక్ మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశంతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వయంపాలనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంఈవో సత్తయ్య అభినందించారు. ఈ సందర్భంగా బోధనలో మెళకువలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చేర్యాల మండలంలోని పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వయంపాలన కార్యక్రమంలో ఎంఈవో కిష్టయ్య పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. నంగునూరు మండలం బద్దిపడగ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు చక్కగా పాఠాలు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొని, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



మర్కుక్: జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు